క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

నిడమనూరు : వానాకాలం సాగుకు ముందు భూసారం పెంపొందించేందుకు రైతులకు జీలుగు, జనుము విత్తనాలు పంపిణీకీ సిద్ధంగా ఉన్నట్లు ఏఈఓ విజయచంద్ర తెలిపారు. నిడమనూరు సహకార విక్రయ కేంద్రంలో 200క్వింటాళ్ల జీలుగా, 30క్వింటాళ్ల జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 30కిలోల జీలుగ 50శాతం సబ్సిడీతో రూ.2137 లకు, జనుము రూ.2510 లకు 40 కిలోల విత్తనాలు అందిస్తారు. రైతు సోదరులు వానా కాలం సాగుకు ముందుకు జీలుగ, జనుము పెంచి భూసారాన్ని కాపాడుకోవాలని ఏఈఓ కోరారు.

అక్రమ నిర్మాణానికి నోటీసు జారీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కలాల్‌వాడలో రోడ్డుపై అక్రమ నిర్మాణం చేపడుతుండడంతో ఆ ఇంటి నిర్మాణదారుడికి శనివారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది నోటీసు జారీ చేవారు. కానీ నిర్మాణదారుడికి నోటీసు ఇచ్చేందుకు వెళ్లగా తిర్కరించడంతో గోడకు అతికించారు. ఆక్రమంగా నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమని, వెంటనే ఆ నిర్మాణాన్ని తొలగించాలన్నారు.

20న నియోజకవర్గ స్థాయి సమావేశం

దేవరకొండ : యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్ పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే బాలునాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వారు కోరారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ,

వేములపల్లి తహసీల్దార్‌గా హేమలత



వేములపల్లి : వేములపల్లి నూతన తహసీల్దార్‌గా హేమలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పుష్పలత కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హేమలత మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పోలీసులను బెదిరించిన వ్యక్తికి రిమాండ్

గుర్రంపోడు : పోలీసుస్టేషన్ ఆవరణలో ఈ నెల 10న పురుగుల మందు తాగుతానని పోలీసులను బెదిరించి వారి విధులకు ఆటంకం కలిగించిన కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు రమేష్‌పై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి వారి విధులకు ఆటంకం కలిగించి, బెదిరింపులకు పాల్పడే వారిపై కొత్త చట్టాల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పందిరిగుండు తండాకు చెందిన ఇస్లావత్ రవి కుమార్తె శైలజ వివాహానికి గాను శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబీకులు వడ్త్య రమేష్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణ సాయం అందించాలి

పెద్దవూర: ఇటీవల ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇళ్లు కూలిపోయిన బాధితుడికి తక్షణ సాయం అందించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేకర్ డిమాండ్ చేవారు. మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన షేక్ చిన్నభాషవియాకు చెందిన కూలిన ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మాడుగులపల్లి : మండలంలోని కల్వలపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతకాయల సతీష్ తండ్రి వెంకటయ్య మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలు శనివారం వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

20న నిరసన ప్రదర్శన

నల్లగొండ టౌన్: ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడిందని, అయితే ఈ నెల 20న నల్లగొండలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య తెలిపారు. శనివారం నల్లగొండలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ పట్టణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని జానిగానితండాకు వెళ్లే రోడ్డు మార్గం కంపచెట్లతో మూసుకుపోయింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ఈ కంపచెట్ల వల్ల ఇబ్బందులు తప్పడం లేదని తండావాసులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వెంటనే ఈ చెట్లను తొలగించే విధంగా చర్యలుతీసుకోవాలని ఈ రోడ్డుమార్గం గుండా వెళ్లే ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

రోడ్డుపై మురుగు

డిండి : మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండులో ఉన్న టాయిలెట్స్, మరుగుదొడ్లకు సంబంధించిన పైప్‌లైన్ పగిలి డ్రెయినేజీ ద్వారా మురుగు నీరు నెల రోజుల నంచి రోడ్డుపై పారుతుంది. దీంతో మురుగు నీటిలో పందులు స్వైర్వ విహారం చేస్తున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఈ విషయం సంబంధిత ఆర్టీసీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రెయినేజీ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ మురుగు

అమ్మవారి జాతరకు వేళాయే !



అడవిదేవులపల్లిలో అమ్మవారి ఆలయం



మహిషాసురమర్థిని అమ్మవారి విగ్రహం

- నేటి నుంచి మహిషాసురమర్థిని ఆలయ ఉత్సవాలు
- వారం రోజుల పాటు నిర్వహణ
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని మహిషాసురమర్థిని అమ్మవారి జాతరకు ఆలయం ముస్తాబైంది. వారం రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఆదివారం అంకురారప్పణ జరగనున్నది. కులమతాలకు అతీతతంగా జరిగే ఈ గ్రామ జాతర గ్రామస్తులందరి పండుగ. ఇప్పటికే ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ జాతరకు పెద్ద ఎత్తున చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలిరానున్నారు. శాసనాల ఆధారంగా అమ్మవారి ఆలయం 16వ శతాబ్దంలో నిర్మించబడింది. ఈ గ్రామం కృష్ణానది తీరంలో బౌద్ధమ గుళ్లుగా ఉండేది. వ్యవసాయ నిమిత్తం క్రమేపి దీనిని అడవిదేవులపల్లి గ్రామంగా ఏర్పాటు చేసుకున్నారు. మహిషాసురమర్థిని అమ్మవారి మూల విగ్రహన్ని పాత ఊరు నుంచి అంగరంగ వైభవంగా ఉరేగింపుగా తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వేసవి చివరి రోజుల్లో అమ్మవారి జాతరను గ్రామస్తులు జరుపుకుంటున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు

అమ్మవారికి జాతరకు ప్రతి ఏటా వేసవి చివరిన వచ్చే పౌర్ణమి తరువాత ఆదివారం అంకురార్పణ జరుపుతారు. ఈనెల 18న ఆదివారం బియ్యం కోల, 19న సోమవారం పుట్టాను, 20న మంగళవారం పుట్ట బంగారం, 21న బుధవారం జల బిందెలు, 22న గురువారం సిరి మానోత్సవం, 23న శుక్రవారం కుంకుమ బండ్లు, శోభయానంగా (ప్రభలు) ఊరేగింపు జరుగుతుంది, 24న శనివారం మహిషాసురమర్థిని అమ్మవారి బలి కార్యక్రమం, 25న ఆదివారం ఈదమ్మ బలి, 26న సోమవారం దీవెన బండారితో జాతర ముగుస్తుంది.

మహిమ కలిగిన తల్లి



కోరిన కొర్కేలు తీర్చి అమ్మవారిగా గ్రామస్తులందరూ నమ్ముతారు. కులమతాలకు అతీతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.అమ్మవారికి మొక్కులను భక్తులు చెల్లించుకుంటారు. అమ్మవారి ఆలయానికి ప్రధాన అర్చకుడిగా పని చేయడం తన అదృష్టం.

– వెల్లటూరి రాంమోహన్‌శర్మ, ప్రధాన అర్చకులు

అన్ని రాజకీయ పార్టీలు నాకు సమానమే

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : తనకు అన్ని రాజకీయ పార్టీలు సమానమేనని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యాసుఫ్ అన్నారు. శనివారం ఆయన తన ఛాంబర్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటానన్నారు. ఉదయం 5గంటలకే పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు. మున్సిపాలిటీ నిబంధనల మేరకు ఏ రాజకీయ పార్టీ వారైన ఫ్లెక్సీలు, జెండాల ఏర్పాటుకు ముందుగా అనుమతి తీసుకొని ఎన్ని రోజులు ఉంచుతారో తెలిపాలని, లేకుంటే 24గంటల తరువాత తొలగిస్తామని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. ఎవరైనా తనకు సమస్యలపై ఫోన్ చేయవచ్చని, ఏదైనా మీటింగ్‌లో ఉంటే ఫోన్ ఎత్తకపోయిన బయటకు వచ్చిన తరువాత చేస్తానని తెలిపారు.

తుమ్మడం కళాకారుడికి జాతీయ అవార్డు

నిడమనూరు : మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన పల్లె కిషోర్‌కుమార్ కళారంగంలో జాతీయ అవార్డు దక్కింది. సాహితీ, కళారంగంలో కిషోర్ కుమార్ సేవలను గుర్తించిన చిన్నారావు వేల్ఫేర్ సొసైటీ అంబేడ్కర్ అవార్డును అందించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ రెహ్మాన్ నుంచి అవార్డు అందుకున్నారు. కిషోర్ కుమార్ నల్లగొండ అన్నెపర్తి బెటాలియన్‌లో రిజర్వు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, సంగీతంలో తబలా కళాకారుడిగా, తెలుగు నాటక పద్య రంగంలో, సాహితీవేత్తగా సేవలందించారు. గ్రామీన నేపథ్యంతో కళలోనూ, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీ వ్యవస్థను అవినీతి మయంగా మార్చిన మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ మోతిరాం పర్యవేక్షణలో ఎస్‌ఐలు సైదిరెడ్డి, హరీశ్‌రెడ్డి, ఏఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, చంద్రయ్య,, మట్టయ్యల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ముందుగా బీజేపీ కార్యకర్తలు లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ కార్యకర్తలకు సీఐ మోతీరాం నచ్చజెప్పారు. అనంతరం కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. కమిషనర్ తీరుతో పట్టణ ప్రగతి కుంటుబడిందని, అక్రమ కట్టాలను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు వస్తే కనీసం మాట్లాడేందుకు కూడా సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, సీనియర్ నేత బంటు సైదులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, వన్ టౌన్, టూ టౌన్ అధ్యక్షుడు గిరి, వెంకటరమణ, వెంకటరమణ, రాజీరెడ్డి, సీతారాంరెడ్డి, సోములు, అభి, యాదగిరి, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్

త్రిపురారం : మత్తు పదార్థాలకు బానిసై చక్కటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎన్నెస్సీ క్యాంప్ ఆవరణలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, మాదకద్రవ్యల వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి యువత, విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, డ్రగ్స్ సేవించడం వల్ల ఆరోగ్యం చెడిపోడంతో పాటు కుటుంబం చిన్నాభిన్నం అవుతుందన్నారు. 'మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని', 'డ్రగ్స్ వద్దు ప్రణమే ముద్దు' 'సేవ్ లైఫ్' అనే నినాదాలతో కూడిన కరపత్రాలను గడప గడపకు పంపిణీ చేశారు. సూర్యాపేట జిల్లాలోని మద్దిరాల మండలంలోని గోరట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తు సమాజంలో మత్తు పదార్థలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని గ్రామస్తులు కొనియాడారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు వస్కుల మట్టయ్య

మిర్యాలగూడ అర్బన్ : నిడమనూరు మండలం బొక్కమంతులపాడు గ్రామానికి చెందిన దళిత యువతి ధర్మవరపు మల్లేశ్వరి మృతికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని బీఎల్ఎఫ్ నాయకులు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. దళితసంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని జ్యోతిరావుపూలే భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. మల్లేశ్వరి కేసులో ఉన్న ఏ6 నర్రెడ్డి ధనపాల్‌రెడ్డి, ఏ7 ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఏ5 కుక్కల మనీష, ఏ9 పోసాని కావ్య లను తక్షణమే అరెస్టు చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు మూడు ఎకరాల భూమి అందించాలని, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. డాక్టర్ జాడి రాజు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాలమహానాడు నాయకులు తాళ్లపల్లి రవి, తలారి రాంబాబు, ఎమ్మార్పిఎస్ నాయకులు మచ్చ ఏడుకొండలు, కేవీపీఎస్ నాయకులు రెమడాల పరశురాములు, జిల్లా రమేష్, ధర్మారపు శివ కుమార్, పుట్టల నరేష్, కోటేష్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మిర్యాలగూడ టౌన్ : జూన్ 2వ తేదీ నుంచి ప్రభుత్వం ఆదేశాల మేరకు వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వలహిస్తున్నందున పారిశుద్ధ్య సిబ్బంది, జవాన్లు పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక దృష్టిని సారించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శనివారం వివిధ శాఖల అధికారులతో పాటు శానిటేషన్ విభాగం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బందితో పాటు మున్సిపల్ సిబ్బంది కూడా సమన్వయంతో పని చేసి వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా మరో వారం రోజుల్లో బయోమైనింగ్ ప్లాంటును ఏర్పాటు చేసి వాటి ద్వారా చెత్తను రీ సైక్లింగ్‌ను చేయడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా వార్డుల్లోకి వెళ్లే సిబ్బంది వివరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణలతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

దేవరకొండలో ఉపాధి హామీ ఓపెన్ ఫోరం

కొండమల్లేపల్లి : దేవరకొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలకు సంబంధించి 2024–25 సంవత్సరానికి గాను 14వ విడత సామాజిక తనిఖీని శనివారం స్థానిక దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 1023 పనులు కొనసాగించారని, ఈ పనుల ద్వారా ఉపాధి హామీ కూలీలకు రూ.7.92కోట్లను చెల్లించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారి వేణుగోపాల్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఫసీయొద్దీన్, స్టేట్ రిసోర్స్ పర్సన్ భద్రునాయక్, దేవరకొండ క్లస్టర్ ఏపీడీ శాలిని, ఎంపీడీఓ డానియల్; ఏపీఓ రామచంద్రయ్య, ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి ఉపాధి కూలీల చేయూత



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధి హామీ కూలీలు

హాలియా : అనుముల మండలంలోని మధారిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుందారపు యాదగిరి(47) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో కుందారపు యాదగిరి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆ గ్రామ ఉపాధి హామీ కూలీలు గుర్తించారు. మానవత దృక్పథంతో 300 మంది ఉపాధి కూలీల నుంచి రూ. 30,000లను విరాళాలు సేకరించారు. ఈ నగదును ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సైదులు సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం కూలీలు యాదగిరి చిత్రం పటానికి పూలమమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అహ్మద్, ఫకీర్, వెంకన్న, రామచంద్రం, కరుణాకర్‌రెడ్డి, మున్నా ఉన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో విద్యుత్ సమస్య పరిష్కారం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని 25వ వార్డులో తరుచు విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గోదాల జానకిరాంరెడ్డి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఈ విషయంపై విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులకు తెలిపారు. శనివారం అధికారులు సరఫరా అంతరాయం కలుగుతున్న విద్యుత్ సమస్య పరిష్కరించారు. తక్షణమే సమస్య పరిష్కరించినందుకు వార్డు ఇన్‌చార్జ్ జానకిరాంరెడ్డి ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో పాటు శ్రీనివాస్, రాథోడ్, పాషా, ఉపేందర్, చిన్నరాజు తదితరులున్నారు.

సురేష్ గుప్తకు ప్రతిభా పురస్కారం

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త మిట్టపల్లి సురేష్ గుప్తకు డాక్టర్ చిక్కా దేవదాస్ 2025 రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా చేనేత వస్త్రాలను ధరించి సేంద్రియ వ్యవసాయ మొక్కల పెంపకం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను ఆయన ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన కళానిలయంలో చిక్కా దేవదాస్ జన్మదినం సందర్భంగా మాజీ పోలీస్ అధికారి సుంకర సత్యనారాయణ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీరామరాజు, మధుర కవి చిక్కా శంకర్, సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.

లచ్చిరాంకు సన్మానం



లచ్చిరాంను సన్మానిస్తున్న మానిటరింగ్ సిబ్బంది

నల్లగొండ: జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న రిసోర్స్ పర్సన్లకు శనివారం స్థానికంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల రిసోర్స్ పర్సన్, తెలుగు ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ రామచంద్రయ్య, కోర్సు డైరెక్టర్ నాగయ్య, డీఆర్పీలు బాలాజీ, నరసింహమూర్తి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

జన హితం కోసమే జన విజ్ఞాన వేదిక



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

వేములపల్లి : జనహితం కోసమే జన విజ్ఞాన వేదిక అని జేవీవీ సీనియర్ నాయకులు పాదూరి రమణారెడ్డి, సత్యనారాయణరావులు అన్నారు. శనివారం వేములపల్లి మండలంలోని మొల్కపట్నం గోదాం వద్ద ఉపాధి హామీ కూలీలకు వారు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా కూలీలు వీలైనంత వరకు ఉదయం పనులు ముగించుకోవాలన్నారు. మార్కెట్‌లో దొరికే నూనెలకన్నా గానుగ ఆడించే వేరుశెనగ, నువ్వులు, కుసుమలు, కొబ్బరి వంటి నూనెలను వాడినట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రజలు కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన జెనరిక్ మందులను వాడాలని, వాణిజ్య ప్రకటనలను చూసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు భాగ్యమ్మ, కూలీలు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రం నుంచి జానిగానితండాకు వెళ్లే రోడ్డు మార్గం నాణ్యత లోపంతో గుంతలు ఏర్పడిన దృశ్యాలు మనకు కనిపిస్తున్నాయి. సుమారు మూడేళ్ల ముగియక ముందే రోడ్డుపై గుంతలు ఏర్పడి నాణ్యత లోపం క్లుప్తంగా కనిపిస్తుంది. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల జియో ఆఫీసు నుంచి పాత్లావత్‌తండా వరకు మూడేళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఆ పాత్లావత్‌తండా నుంచి జానిగానితండా వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ తారు రోడ్డు నిర్మాణ పనుల్లో గుత్తేదారు నాణ్యత లోపం వల్ల 3 సంవత్సరాలు ముగిసే సరికి రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ తండా మీదుగా ముష్టిపల్లి గ్రామం నుండి నాంపల్లి మండలానికి వెళ్లడం జరుగుతుంది. ఇలా నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జానిగాని తండాకు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. శనివారం దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సబ్ డివిజన్ పరిధిలో మండల పరిషత్, మున్సిపల్, పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు రాజీపడేలా చూడాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేష్, కర్నాటి సురేష్, న్యాయవాదులు ఇంద్రవరప్రాద్, రాములు, యాదయ్య, పుష్పలత, శ్రీకాంత్, రాజ్‌కుమార్, కృష్ణ, ఇద్దయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జడ్జి అనిత, అధికారులు

మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక



అభివాదం చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

మిర్యాలగూడ అర్బన్ : భారత జాతీయ మహిళా సమాఖ్య మిర్యాలగూడ నియోజకవర్గ నూతన కమిటీని శనివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. తొమ్మిదిమందితో పట్టణ కమిటీని ఎన్నుకోగా నియోజకవర్గ అధ్యక్షురాలిగా దాసర్ల దుర్గమ్మ, కార్యదర్శిగా ఎర్రబోతు పద్మ, వర్కింగ్ ప్రసిడెంట్‌గా డి.శాంతి, ఉపాధ్యక్షురాలిగా ఎర్ర ప్రమీల, సహాయ కార్యదర్శులుగా కోటమ్మ, మమత లను ఎన్నుకోగా.. పట్టణ అధ్యక్షురాలిగా మామిడి మార్తమ్మ, కార్యదర్శిగా షమీం, వర్కింగ్ ప్రసిడెంట్‌గా గుమ్మకొండ అంజమ్మ, ఉపాధ్యక్షురాలిగా లీల, సహాయ కార్యదర్శిగా సులోచన, కోశాధికారిగా సయ్యద్ నూర్జిలతో పాటు మరో ముగ్గరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్న తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, సైదమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.